క్లుప్తంగా

6 నుంచి నూకాలమ్మ జాతర ఉత్సవాలు


నూకాలమ్మ తల్లి

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లోని నూకాలమ్మ ఆలయంలో వచ్చే నెల 6వ తేదీ నుంచి నెల రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అమ్మవారిని గ్రామ దేవతగా కొలుస్తారు. కొత్త అమావాస్యను పురస్కరించుకుని ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ మేరకు ఏప్రిల్ 5వ తేదీన గరగలతో అమ్మవారిని తీసుకొని వస్తారు. 6వ తేదిన బలుసులపేటలో చిన్న జాగరంతో ఉత్సవాలు ప్రారంభించనున్నట్టు ఆలయ దర్మకర్త వల్లూరి బుల్లియ్య తెలిపారు. ఉత్సవాల అనంతరం అన్నదానం చేయనున్నట్టు ఆయన తెలిపారు.

2న దళిత ఆత్మీయ సమావేశం


నవర గ్రామంలో దళిత ఆత్మీయ సమావేశానికి ఆహ్వానిస్తున్న నాయకులు

సామర్లకోట: వచ్చేనెల రెండో తేదీన నిర్వహిస్తున్న దళిత ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జానీ మోజెస్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండల పరిధిలో నవర, చంద్రపాలెం గ్రామాలలోని దళితులను కలుసుకుని ఆత్మీయ సమావేశానికి హాజరు కావాలన్నారు. బీసీ, ఎస్సీలకు వైఎస్సార్ సీపీలోనే గుర్తింపు ఉంటుందని ఆయన తెలిపారు. దీనిలో భాగంగానే బీసీ, ఎస్సీలకు గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక ఎమ్మెల్యే టిక్కెట్లు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు లింగం శివ ప్రసాద్, నేతల హరి బాబు తదితరులు పాల్గొన్నారు.

1000 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం


కోనపాపపేట తీర ప్రాంతంలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

పిఠాపురం: కొత్తపల్లి మండలం పొన్నాడ శివారు కోనపాపపేట తీర ప్రాంతంలో సారా బట్టీలపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ట్రైనీ డీఎస్పీ ప్రమోద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 1000 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశారు. 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు కొత్తపల్లి ఎస్సై స్వామినాయుడు తెలిపారు. సారా తయారీ దారులు పరారీలో ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా ట్రైనీ డీఎస్పీ ప్రమోద్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో సారా తయారీపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సారా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎక్కడైనా సారా తయారు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

వనదుర్గ అమ్మవారికి చండీహోమం


రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

తొండంగి: అన్నవరంలోని రత్నగిరిపై వన దుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమ ద్రవ్యాలను వేసి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో వేద పండితులు, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు

తొండంగి: మండలంలోని దానవాయిపేట బీచ్ రోడ్డులో వేంచేసిన వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు అగ్నిహోత్రం రంగాచార్యులు, శుంకరణం వెంకట్రాజుశర్మ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి కల్యాణోత్సవం, కోలాటం, అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ మడదా ప్రభాకరరావు తెలిపారు.

పాపుల రక్షణకే శిలువ ధ్యానము

- భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే
- నియోజకవర్గ వ్యాప్తంగా ప్రార్థనలు చేసిన క్రైస్తవులు


సామర్లకోటలో సాగిన ఏసు శిలువ యాత్రను తిలకించిన దవులూరి దొరబాబు తదితరులు

పెద్దాపురం: పాపులను రక్షించేందుకు క్రీస్తు ఏసు మానవ రూపంలో జన్మించి శిలువ ధ్యానంలో మృతి చెంది జనులకు ఇచ్చిన మాటను నెరవేర్చేందుకు మూడో రోజున సమాధి నుండి లేచి పునరుత్థానమైనట్టు దైవ జనులు చెప్తారు. పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో గుడ్ ఫ్రైడే ఘనంగా నిర్వహించారు. అన్ని దేవాలయాల్లో ప్రజలు ప్రత్యేక శిలువ ధ్యాన ఆరాధనలు నిర్వహించారు.

మండలంలోని దివిలి, తిరుపతి, చదలాడ, కాండ్రకోట, విరవ క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరాల్లో గుడ్ ఫ్రై డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. దైవజనులు నంగిన సత్యానందం, నంగిన శామ్యూల్ సుదీప్‌లు ఆయా ఆలయాల్లో శిలువ ధ్యాన ప్రార్థనలు నిర్వహించి ఏసు శిలువలో పలికిన ఏడు మాటలను బోధించారు. జగ్గంపేట రోడ్డులోని తండ్రి,కుమార, పరిశుద్ధాత్మ సంఘం ఆధ్వర్యంలో వందల సంఖ్యలో విశ్వాసులు క్రీస్తు ఆరాధనలో భాగస్వాములు కాగా పరంజ్యోతిమ్మ క్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటలను బోధిదంచారు. అలాగే పట్టణంలో స్థానిక బైబిల్ మిషన్ స్వర్ణదేవాలయం శుభ శుక్రవారం క్రీస్తు ధ్యాన ఆరాధనలు ఘనంగా నిర్వహించారు. బైబిల్ మిషన్ సెక్రటరీ, దైవజనులు ఇమ్మానియేలు క్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటాలను జ్ఞాపకం చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆర్డీవో కార్యాలయం ఎదురుగా ఉన్న లూథరన్ చర్చి శిలువ ధ్యాన అరాధన నిర్వహించారు. స్థానిక కట్టమూరు పుంత కల్వరి మిరాకిల్ చర్చిలో శుభ శుక్రవారం ఆరాధానలు ఘనంగా నిర్వహించారు. క్లాప్స్ అధ్యక్షులు లంక పురుషోత్తమ్‌దాస్ ఆధ్వర్యంలో శిలువ ధ్యాన ప్రసంగం అందించారు.


క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరంలో ఏసు పలికిన మాటను బోధిస్తున్న సత్యానందం

భక్తులతో శిలువ యాత్ర

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఫాదర్ ఎస్.పీటర్ ఆధ్వర్యంలో ఏసు ప్రభు శిలువ నాటికను ప్రదర్శించారు. స్టేషన్ సెంటర్ నుంచి ఏసుప్రభు వేషధారణలో శిలువ మోస్తూ యాత్ర నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు యాత్రను తిలకించి గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు. మానవాళి పాప పరిహారం కోసం ప్రాణాలు అర్పించిన త్యాగశీలి క్రీస్తు అని పేర్కొన్నారు. ఆయా చర్చిలలో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ఎస్వీఐ శేఖర్ ఆధ్వర్యంలో శిలువ యాత్ర జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. ఏసుప్రభు వేషధారిగా కె.చంద్రశేఖర్, పిలాతుగా వి.రాజశేఖర్, రాజుగా సతీష్, రాజభటులుగా గంగాధర్, పండు, కృష్ణ, వేణు, అభి, నవీన్, తేజ, ఉపదేశులుగా శ్యామ్, రాజ్, దాసు, కిశోర్, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.


గొల్లప్రోలులో ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు

నేడు రన్ ఫర్ జీసస్

సామర్లకోట: మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం రన్ ఫర్ జీసస్ నిర్వహించనున్నట్టు మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డిక్టర్ ఎం సాల్మన్ రాజు, కార్యదర్శి వి.జాన్ తెలిపారు. యేసుక్రీస్తు సిలువ ధాన్య కూడికలు శుభ శుక్రవారంతో ముగియగా ఏసు క్రీస్తు మూడో రోజున సమాధిని గెలిచి సజీవునిగా లేచిన సందర్భాన్ని స్మరించుకొంటూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శనివారం ఉదయం ఆరు గంటలకు స్థానిక సీబీఎం హైస్కూల్ గ్రౌండ్ నుంచి స్టేషన్ సెంటర్‌కు చేరుకొని మానవహారం నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

గొల్లప్రోలులో..

గొల్లప్రోలు: పట్టణంలో శుక్రవారం గుడ్ ఫ్రై డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఆర్‌సీఎం చర్చి పాస్టర్ భర్తలోమియో ఆధ్వర్యంలో క్రైస్తవులు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు, శిలువ వేషధారణలు ఆకట్టుకున్నాయి. గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యతను పాస్టర్ భర్తలోమియో వివరించారు. పలువురు విశ్వాసులు పాల్గొన్నారు.

గుండెలను హత్తుకునే ఆప్యాయత..!


ఎన్నికల ప్రచారంలో అవ్వను హత్తుకున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత

పిఠాపురం: నియోజకవర్గ ప్రజలకు సుపరిచితురాలు, అనురాగం, ఆప్యాయత కలబోసిన కలుపుగోరుతనం ఆమె సొంతం. ఆమె కనిపిస్తే చాలు గుండెలనత్తుకోక మానరు పిఠాపురం నియోజకవర్గ ప్రజలు. ఆమె కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం అభ్యర్థి వంగా గీత. ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న ఆమె జోరు ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తోంది.

స్థానికుడిని.. గెలిపించండి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి
- 27వ వార్డులో చురుగ్గా ఎన్నికల ప్రచారం


ఎన్నికల ప్రచారంలో ఓటు అడుగుతున్న దవులూరి దొరబాబు

పెద్దాపురం: స్థానికంగా ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉందని నియోజకవర్గ ప్రజలు ఆదరించి స్థానికుడినైన తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని దవులూరి దొరబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలో 27వ వార్డు సత్తెమ్మకాలనీ, ఎన్టీఆర్ కాలనీల్లో ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, తాడి రాజశేఖర్, ఆ వార్డు ఇన్‌చార్జి షేక్ రఫీ, కడియాల కనకదుర్గ, ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారాన్ని ఉద్దేశించి దొరబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తెరిగి ప్రజలు వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీ గెలుపునకు నాంది అని, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్‌కు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని దొరబాబు కోరారు. జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ గోపు మురళి, నియోజకవర్గ పరిశీలకులు చీకట్ల వెంకటేష్, పట్టణ కన్వీనర్ చింతా శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు కాపుగంటి కామేశ్వరరావు, గోపు నారాయణమూర్తి, కౌన్సిలర్లు త్సలికి సత్య భాస్కర్, విడదాసరి రాజా, కో–ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, అత్తిలి సీతారామస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి పట్టం కట్టండి

- కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం అభ్యర్థి వంగా గీత
- కోలంక, ఎల్ఎన్‌పురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం


కోలంకలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వంగా గీత

పిఠాపురం: మునుపెన్నడు లేనివిధంగా రూ.కోట్ల వ్యయంతో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమాన్ని చూసి వచ్చే ఎన్నికల్లో తమకు ఓటు వేయాలని వైఎస్సార్ సీపీ పిఠాపురం అభ్యర్థి వంగా గీత విజ్ఞప్తి చేశారు. పిఠాపురం మండలం కోలంక, ఎల్ఎన్‌పురం గ్రామాల్లో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరప్రత్రాలను పంపిణీ చేశారు. అడుగడుగునా స్థానికులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్న ప్రభుత్వానికి మరో అవకాశం ఇవ్వాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.కోట్ల నిధులు వెచ్చించి పిఠాపురం నియోజకవర్గాన్ని చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి చేశారన్నారు. మరింత అభివృద్ధి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నారన్నారు. గ్రామాల్లో ప్రధాన సమస్యలకు ఇప్పటికే పరిష్కారం చూపించామన్నారు. ఎన్నికల హామీలను వంద శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న వంగా గీత

- కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం అభ్యర్థి వంగా గీత
- గొల్లప్రోలులో పార్టీ శ్రేణులతో సమావేశం

గొల్లప్రోలు: వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత సూచించారు. గొల్లప్రోలులో శుక్రవారం వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మైనం రాజా అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కాకినాడ ఎంపీ, పార్టీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి డాక్టర్ అనుసూరి పద్మలత, ఏపీఎఫ్ఐడీసీ డైరెక్టర్ వనం సత్యకల్యాణి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అనుసూరి పద్మలత మాట్లాడుతూ మహిళా సాధికారతకు నిలువెత్తు నిదర్శనం వంగా గీత అన్నారు. ఆమె పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడం ఇక్కడ ప్రజల అదృష్టమన్నారు. వచ్చే ఎన్నికల్లో వంగా గీతను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత మాట్లాడుతూ ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ఇక్కడి ప్రజలకు బలంగా వినిపించాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేసి వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మొగలి బాబ్జీ, గండ్రేటి శ్రీరామ చంద్రమూర్తి, జ్యోతుల భీముడు, మొగలి శివ, అనిశెట్టి వెంకటసుబ్బారావు, తెడ్లపు చిన్నారావు, గంధం నాగేశ్వరరావు, తెడ్లపు నాగేంద్ర, గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

కోడ్‌తో అప్రమత్తం


తాటిపర్తిలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ

ఎంసీసీ కన్వీనర్, ఎంపీడీఓ ఉషారాణి

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలుపై పంచాయతీ సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ఎంసీసీ కన్వీనర్, పెద్దాపురం ఎంపీడీఓ జి.ఉషారాణి అన్నారు. మండలంలోని తాటిపర్తి గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం వద్ద సిబ్బందితో ఆమె మాట్లాడుతూ కోడ్ అమలును సమర్థవంతంగా నిర్వహించేందుకు పోలింగ్ బూత్‌ల నిర్వహణకు అన్ని చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. గ్రామాల్లో కోడ్ అమలుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధానంగా పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ర్యాంపులు, మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందిని ఆదేశించారు. కోడ్ ఉల్లంఘన జరిపితే సహించేది లేదన్నారు. గ్రామాల్లో ఎక్కడా రాజకీయ పార్టీలకు సంబంధించిన పోస్టర్లు, ఫ్లెక్సీలు, స్టిక్కర్లు ఉంటే వెంటనే తొలగించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. స్వీప్ లక్ష్యాన్ని ప్రజలకు వివరించి గ్రామాల్లో నూరు శాతం పోలింగ్‌కు సిబ్బంది మరింత కృషి చేయాలని ఉషారాణి ఆదేశించారు. ఆమె వెంట మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్, వీఆర్ఓ వెంకటేశ్వరరావు. సచివాయల సిబ్బంది ఉన్నారు.


సామర్లకోట-పెద్దాపురం ఏడీబీ రోడ్డులో వాహనాలను తనిఖీ చేస్తున్న శివరామకృష్ణయ్య తదితరులు

నిబంధనలు పాటించాలి

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పని సరిగా పాటించాలని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తెలిపారు. పట్టణ పరిధిలో ఎంఈఓ వై.శివరామకృష్ణ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిగా, మండల పరిధిలో ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుత పెళ్లిళ సీజన్‌లో వెంట నగదు, బంగారం తీసుకు వెళ్లే సమయంలో తగిన ఆధారాలు ఉండాలన్నారు. ఈ మేరకు ముందుగా పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారుల నుంచి అనుమతి పత్రాలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణికులను తీసుకొని వెళ్లే వాహనాల్లో ఎన్నికలల్లో పోటీ చేసే వారి ఫ్లెక్స్ ఉండడం నేరమని తెలిపారు. వాహనాలకు ఫ్లెక్సలు, జెండాలు ఏర్పాటు చేస్తే వాటికి అనుమతులు ఉండాలని, దానికి సంబంధించిన ఖర్చులను ఆయా అభ్యర్థి ఖాతాలో నమోదు చేస్తామని వారు తెలిపారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ప్రతిపాడు రూరల్: మనబడి నాడు–నేడు పథకంలో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారని మండల విద్యాశాఖ అధికారి వి.రాజబాబు అన్నారు. మండలంలోని ధర్మవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆయా ప్రదర్శనల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు ఎంఈఓ రాజబాబు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్నదానం

గోకవరం: స్థానిక రమాసత్యనారాయణస్వామి ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నదానం జరిగింది. ఆలయ శిఖర పునఃప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం మహోత్సవాల ముగింపును పురస్కరించుకుని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు, పద్మావతిదేవి దంపతుల ఆధ్వర్యంలో అన్నసమారాధనం నిర్వహించారు. సుమారు ఆరు వేల మంది పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. తొలుత ఆలయ అర్చకులు ఆరవిల్లి సీతారామాచార్యులు, వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వరసాల ప్రసాద్, మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్నదొర, వరసాల ప్రసాద్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భవిత బంగారమాయె

- దివ్యాంగ విద్యార్థులకు వరం
- ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు


పెద్దాపురం భవిత కేంద్రంలో ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంఈఓలు (ఫైల్)

పెద్దాపురం: శారీరకంగా, మానసికంగా పుట్టుకతోనే ఏదో లోపంతో జన్మించిన విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవిత కేంద్రం ఎంతో ఆసరాగా నిలుస్తోంది. చీకటిలో ఉన్న వారి భవితను బంగారుమయం చేస్తోంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలు వారికి ఎంతగానో తోడ్పాటునందిస్తున్నాయి. విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు అందరితో సమానంగా జీవించేలా భవిత కేంద్రాలు భరోసానిస్తున్నాయి.

శిక్షణ ఇలా..

నియోజకవర్గ పరిధిలోని పెద్దాపురం, సామర్లకోట మండల కేంద్రాల్లో ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇక్కడ రెండు కేంద్రాల్లో ప్రత్యేక అవరాలు కల్గిన సుమారు 30 మంది చిన్నారులకు సోమవారం నుంచి శుక్రవారం వరకు ఫిజియోథెరపీలో శిక్షణ ఇస్తున్నారు. మందబుద్ధి, దృష్టి, వినికిడి లోపాలు కల్గిన విద్యార్థులకు స్పీచ్ థెరపీ, బ్రెయిలీలిపిలో శిక్షణతో జీవితం అందిపుచ్చుకునేలా శిక్షణ ఇస్తున్నారు. ప్రతి గురువారం ప్రత్యేక ఫిజియోథెరపీ శిక్షణ ఇస్తున్నారు. అడుగు తీసి అడుగు వెయ్యలేని చిన్నారులందరికీ నడక నేర్పిస్తున్నారు. ఐఈఆర్‌పీ (ఇంక్లూజివ్ ఎడ్యూకేషన్ రిసోర్స్‌పర్సన్)లను చిన్నారుల ఇంటికి వెళ్లి ఫిజియోథెరపీ చేసేలా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మాటలు రాని వారికి స్పీచ్ థెరపీ ద్వారా శిక్షణ ఇచ్చి మాటలు వచ్చేలా చేస్తుండడంతో భవిత సేవలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాయితీలు

భవిత కేంద్రాలకు వచ్చే విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం పలు రాయితీలు అమలు చేస్తోంది. భవిత కేంద్రానికి వచ్చేందుకు రావాణా ఖర్చుల కింద ప్రతి నెలా రూ.300 ఇస్తోంది. వారికి భద్రతగా వచ్చే తల్లిదండ్రులకు రూ.250 చొప్పున రాయితీ అందిస్తోంది. వారికి అవసరమైన పరికరాలు, ఆట వస్తువులను ఉచితంగా అందజేస్తోంది. వారికి మధ్యాహ్న భోజనం, దుస్తులు, వినికిడి యంత్రాలు, వీల్ చైర్లు తదితర వస్తువులను ప్రభుత్వమే సమకూరుస్తోంది. అవపరమైన చిన్నారులకు శస్త్ర చికిత్సలను చేయిస్తున్నారు.

చాలా వరకూ నయమైంది



మా అబ్బాయి జగదీష్ పుట్టుక నుంచే బధిరుడు. భవిత కేంద్రంలో స్పీచ్, ఫిజియోథెరపీ చేయించాం. అలా చేయడం వల్ల చాలా వరకు నయమైంది. గత నాలుగేళ్ల భవిత సేవలను వినియోగించుకుంటున్నాం.

– పల్ల లలిత, విద్యార్థి తల్లి, కట్టమూరు, పెద్దాపురం మండలం

విభిన్న ప్రతిభావంతుల్లో మార్పే లక్ష్యం



విభిన్న ప్రతిభావంతుల్లో మార్పే లక్ష్యంగా పని చేస్తున్నాం. సాటి విద్యార్థుల్లా వారు కూడ ఉండాలని శిక్షణ ఇస్తున్నాం. వారి మానసిక పరిస్థితిని అంచనా వేసి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థుల తల్లిదండ్రులు భవిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– బి.దుర్గాప్రసాద్‌రెడ్డి, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయుడు, పెద్దాపురం